

రోడ్డు అభివృద్ధి చేయాలని గోతుల్లో వరినాట్లు వేసి నిరసన

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో అధ్వానంగా వున్న రోడ్డు అభివృద్ధి చేయాలని కోరుతూ అప్పలరాజుగూడెం ఆంజనేయ స్వామి గుడి వద్ద రోడ్డుపై వున్న గుంతల్లో వరి నాట్లు వేసి శనివారం నిరసన వ్యక్తం చేశారు. తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ రోడ్లపై వున్న గుంతలు చెరువులను తలపిస్తున్నాయని విమర్శించారు. రోడ్డు అభివృద్ధి చేయకపోతే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు కాటేపల్లి సత్యనారాయణ, మెతుకుమిల్లి నాగేంద్ర, పరిమి పుల్లారావు, కలపాల నాగరాజు, ఎల్లిన జగన్, తాళ్ల దుర్గారావు, గౌర్ని ప్రసాద్, తమ్మిన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తెలుగు యువత

కాపర్ డ్యామ్‌తో కొంప కొల్లేరు..!



పునరావాస కేంద్రంలో వంటలను పరిశీలిస్తున్న జెసి

కుక్కునూరు మండలంలో చీరవల్లి-వింజరం ప్రధాన రహదారిపై వరద నీరు

2022లో ఇళ్ల పైకప్పులను ముంచెత్తిన వరద

మళ్లీ జలదిగ్బంధంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు

రోడ్లపైకి నీరు చేరడంతో గ్రామాల మధ్య రాకపోకలు బంద్

భద్రాచలం వద్ద 55 అడుగులు దాటిన నీటిమట్టం

పోలవరం ఎగువ కాపర్‌డ్యామ్ వద్ద 35 మీటర్లకు నీటిమట్టం

మరో రెండు మీటర్లు పెరిగితే గ్రామాలన్నీ ఖాళీ చేయాల్సిందే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిర్వాసితులకు పరిహారం ఇచ్చి తరలించకుండా పోలవరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కాపర్ డ్యామ్ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలకు పెనుశాపంగా మారింది. గతంలో దశాబ్దాలకు ఒక్కసారి వచ్చే గోదావరి వరద ఇప్పుడు ప్రతియేటా గ్రామాలను ముంచెత్తుతోంది. గతేడాది ఇదే రోజుల్లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గ్రామాల పైకప్పుల మీదుగా వరద నీరు ప్రవహించింది. వేలాది కుటుంబాలు నిరాశ్రయులుగా మారి పునరావాస కేంద్రాల్లో నెలలు తరబడి తలదాచుకున్నారు. పట్టుమని ఏడాది గడవక ముందే మళ్లీ కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను గోదావరి వరద చుట్టేసింది. దీంతో గ్రామాలు గ్రామాలే ఖాళీ చేయాల్సి వస్తోంది. ఈ రెండు మండలాల ప్రజలు గ్రామాలు ఖాళీ చేయాల్సినంత విధంగా పెద్ద వరదలు 1956, 1986లో రాగా 2006లో వచ్చిన వరదకు కొన్ని గ్రామాలను ఖాళీ చేయాల్సి వచ్చినట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. కాపర్ డ్యామ్ నిర్మాణంతో పరిస్థితి మారిపోయింది. 2022 జులైలో వరదకు గ్రామాలు ఖాళీ చేసిన ప్రజలు మళ్లీ ఏడాది గడవకముందే 2023లోనూ గ్రామాలను విడిచి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి ప్రధాన కారణం కాపర్‌డ్యామ్ నిర్మాణమేనని అక్కడి ప్రజలు ఘొల్లుమంటున్నారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా కాపర్ డ్యామ్, స్పిల్‌వే నిర్మాణం వంటివి చేపట్టడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు ప్రతియేటా వరద ముంచెత్తుతోంది. ఒకప్పుడు భద్రాచలం వద్ద 62 అడుగుల నీటిమట్టానికి ఎంత వరద వచ్చిందో ఇప్పుడు 55 అడుగుల నీటిమట్టానికే అంత వరద వస్తుందని ప్రజలు చెబుతున్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి గ్రామాలను ఖాళీ చేయించకుండా కాపర్ డ్యామ్ నిర్మాణం చేపట్టడమే ఈ దుస్థితికి కారణమని నిర్వాసితులంతా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గతేడాది ఇదే సమయానికి ఇళ్లు, వాకిళ్లు వదిలి నెలలు తరబడి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నామని, ఏడాది గడవకముందే మళ్లీ తట్టాబుట్ట సర్దుకుని కొండలు, గుట్టలపైకి వెళ్లాల్సి వస్తుందని అంతా కన్నీరుమున్నీరవుతున్నారు. పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తుందనే బాధ అందరినీ వెంటాడుతోంది. గోదావరి వరద పెరుగుతుండటంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ మండలాల్లో మొత్తం 107 నివాస ప్రాంతాలుండగా ఇప్పటికే వరద ముంపునకు 31 గ్రామాలకు పైగా ఖాళీ చేయాల్సి వచ్చింది. వరద పెరుగుతుండటంతో మిగిలిన గ్రామాల ప్రజలు సైతం ఇళ్లు విడిచిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నిర్వాసితులను తరలించకుండా కాపర్ డ్యామ్ నిర్మించడంతో వరద నీరు వెనక్కి బిగదన్ని గ్రామాలు ముంపు బారిన పడుతున్నట్లు స్పష్టమవుతోంది. కాపర్ డ్యామ్ తమ కొంప ముంచుతుందని నిర్వాసితులు లబోదిబోమంటున్నారు.

భయపెడుతున్న గోదావరి

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సాయంత్రం ఐదు గంటలకు 55.40 అడుగులకు చేరింది. ఆదివారానికి మరింత పెరగనున్నట్లు అంచనా వేస్తుండటంతో అంతా భయాందోళనకు గురవుతున్నారు. భద్రాచలం వద్ద 15.59 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం ఎగువ కాపర్ డ్యామ్ వద్ద నీటిమట్టం 35 మీటర్లకు చేరింది. దిగువకు 12.80 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. పోలవరం కాపర్ డ్యామ్ వద్ద మరో రెండు మీటర్లు వరద పెరిగితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని అత్యధిక గ్రామాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. ఇప్పటికే 31కుపైగా గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. 2,700 కుటుంబాలు పునరావాస కేంద్రాలకు, గుట్టలు, కొండలపైకి తరలివెళ్లారు. వరద పెరుగుతుండటంతో ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరి గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా శనివారం కుక్కునూరు మండలం చీరవల్లి-వింజరం మధ్య రోడ్డుపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికే పలు గ్రామాలకు చెందిన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించగా శనివారం కుక్కునూరులోని మసీదు బజార్, గణేష్‌నగర్, రజక బజార్ ప్రాంతాలకు చెందిన 120 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. కౌండిన్యముక్తి, బెస్తగూడెం ఎస్‌సి కాలనీకి చెందిన కుటుంబాలను కూడా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కుక్కునూరు ప్రధాన రహదారిపై ఉన్న పెట్రోల్ బంకు దగ్గరకు వరదనీరు చేరింది. దీంతో గోదావరి వరద ఉధృతి చూసి అంతా భయభ్రాంతులవుతున్నారు. భద్రాచలం వద్ద మరో రెండు, మూడు అడుగులు వరద పెరిగితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుపోనున్నాయి. వరద ఉధృతి పెరుగుతుండటంతో ముంపు చర్యలను పర్యవేక్షించేందుకు వేలేరుపాడు మండలానికి నూజివీడు సబ్ కలెక్టర్‌ను, కుక్కునూరు మండలానికి ఐటిడిఎ పిఒను పర్యవేక్షకులుగా నియమించారు.

గోదావరి జోరు.. జనం బేజారు..!

ప్రజాశక్తి - కుక్కునూరు

మూడు రోజులుగా గోదావరి వరద ఉధృతి క్రమేపీ పెరుగుతూ మండలాన్ని చుట్టుముట్టింది. భద్రాచలంలో నీటిమట్టం 55.40 అడుగులకు చేరి మూడో ప్రమాద హెచ్చరికను దాటి ఉగ్రరూపం దాల్చడంతో శనివారం మండలంలో పలు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. కుక్కునూరులో సినిమాహాల్ సెంటర్, గణేష్ నగర్, మసీదు సెంటర్‌లకు చెందిన వంద కుటుంబాలను కివ్వాకలోని పునరావాస కేంద్రానికి తరలించారు. బెస్తగూడెం ఎస్‌సి కాలనీకి చెందిన 150 కుటుంబాలను రావికుంట పునరావాస కేంద్రానికి, కౌండిన్యముక్తికి చెందిన 50 వరద బాధిత కుటుంబాలను మర్రిపాడు పునరావాస కేంద్రానికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత పది రోజులుగా గోదావరి వరద ఉధృతి కొనసాగుతుండటంతో మండలంలోని ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరి ముంచెత్తడంతో 30 గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతుండటంతో చీరవల్లి-వింజరం, వేలేరు-బూర్గంపాడు మధ్య ప్రధాన రహదారిని వరద ముంచెత్తింది. దీంతో మండలం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. మూడురోజులుగా ఎటూ వెళ్లేందుకు దారి లేకపోవడంతో ప్రయాణికులు, అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్‌కు వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పది రోజులుగా గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 253 కుటుంబాలను, రేపాకగొమ్ము గ్రామానికి చెందిన 203 కుటుంబాలను రావికుంట పునరావాస కేంద్రంలో, కుక్కునూరు ఎ బ్లాక్‌లోని 350 వరద బాధిత కుటుంబాలను కివ్వాక ఆర్అండ్ఆర్ కాలనీకి తరలించి వీరికి భోజనం, తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించినట్లు తహశీల్దార్ ప్రమద్వర తెలిపారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో మండల కేంద్రంలోని మసీదు సెంటర్, దాసరి బాజారు, రజక బజార్లను వరద ముంచెత్తింది. గతేడాది వరద ఎక్కువగా రాదని సామాన్లు ఇళ్లలోనే వదిలివెళ్లిన జనం ఈసారి ట్రాక్టర్లపై సామగ్రిని సైతం సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

12,80,474 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

పోలవరం: పోలవరం ప్రాజెక్టుకు అదనంగా వస్తున్న 12,80,474 లక్షల క్యూసెక్కుల గోదావరి నీటిని జల వనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం 25.080 మీటర్లకు చేరుకుంది. ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 35.010 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ఏలూరు: గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కోరారు. శనివారం ఏలూరు నుంచి వరద సహాయ పునరావాస కార్యక్రమాల విధుల్లో ఉన్న జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఐటిడిఎ పిఒ, ఆర్‌డిఒలు, డిపిఒ, డబ్ల్యుఎస్ ఎస్ఇ, డిఎంహెచ్ఒ, డిఆర్‌డిఎ పీడీ, ఇతర ప్రత్యేకాధికారులు, సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వరద పరిస్థితిపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ పునరావాస కార్యక్రమాలు అత్యంత సమర్థవంతంగా సాగాలన్నారు. బాధితులకు అందుబాటులో ఉంటూ ఎటువంటి సమస్యలూ లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. గోదావరి ఇంకా పెరిగితే ముంపునకు గురయ్యే ప్రజలను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వారికి భోజన ఏర్పాట్లు చేయడంతోపాటు ఎవరైతే ఇళ్ల దగ్గర ఉన్నారో వారికి నిత్యావసర వస్తువులు అందించాలన్నారు. వేలేరుపాడు మండలానికి నూజివీడు సబ్ కలెక్టర్, కుక్కునూరు మండలానికి ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ పర్యవేక్షకులుగా ఉంటారన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో ఏడున్నర కిలోలు గల 15 వందలు కూరగాయల కిట్లను సిద్ధం చేశారన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస శిబిరాల నుంచి వెళ్లేటప్పుడు ఆయా కుటుంబాలకు రూ.2 వేలు, వ్యక్తులకు వెయ్యి రూపాయలు అందజేయాల్సి ఉంటుందని, ఈ దృష్ట్యా పునరావాస కేంద్రాల్లో ఉన్నవారి వివరాలు పొందుపర్చేందుకు రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

వేలేరుపాడు: పునరావాస కేంద్రంలోని ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అధికారులను ఆదేశించారు. మండలంలోని శివకాశీపురంలో పునరావాస కేంద్రాన్ని శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి లావణ్యవేణి మాట్లాడుతూ పునరావాస కేంద్రంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బియ్యం, నూనె, కూరగాయలు వంటి సరుకులు పూర్తిస్థాయిలో నిల్వ ఉండేలా చూడాలన్నారు. జెసి వెంట జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, అధికారులు ఉన్నారు.

కొల్లేరుకు వరద

ఉధృతంగా ప్రవహిస్తున్న సర్కారు కాలువ

కైకలూరు : కొల్లేరు సరస్సుకు వరద ఉధృతి కొనసాగుతోంది. కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ గుడికి వెళ్లే దారిలో సర్కార్ కాలువపై ఉన్న వంతెన వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. కర్రల వంతెన మరమ్మతులకు గురికావడంతో వాహనాల రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. కేవలం పాదచారులు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉందని చెప్పారు. కొల్లేరులో నాటు పడవలపై ప్రమాదకర ప్రయాణాలు సాగించొవద్దని ఆయన సూచించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

వరద బాధితులకు సరుకులు అందించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గోదావరి వరద ఉధృతికి గురైన ప్రజలందరికీ తక్షణం నిత్యావసర సరుకులు అందించాలని, వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి పునరావాస కేంద్రాలకు తరలించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల ముఖ్యకార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా, ఏలూరు జిల్లాల్లో ముంపులో ఉన్న ఎనిమిది మండలాల్లో పోలవరం నిర్వాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతిఒక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, 16 రకాల నిత్యావసర సరుకులు, రూ.పది వేల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముంపులో ఉన్న నిర్వాసితులకు ఉండేందుకు పునరావాస శిబిరాల్లో కరెంటు, వైద్యం, రాకపోకల సౌకర్యాలు ఇప్పటి వరకు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది రోజుల నుంచి ఎంపీ, ఎంఎల్‌ఎలు మొద్దు నిద్ర పోతున్నారని, గిరిజనులు గోదావరిలో మునిగిపోతే ఆదుకోకుండా ఎంఎల్ఎ బాలరాజు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనటం సిగ్గుచేటని విమర్శించారు. గత సంవత్సరం ముంపునకు గురైన బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని, అందువల్లే సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వాన రెండు జిల్లాల్లోని ముంపు మండలాల్లో పాదయాత్ర చేసి గిరిజనులకు జరుగుతున్న నష్టాన్ని, అన్యాయాన్ని పరిశీలించిన విషయం గుర్తు చేశారు. దీనిపై నిధులు కేటాయించి నిర్వాసితులను ఆదుకోవాలని, ముంపునకు ముందే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చినప్పటికీ సరిగా స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులు గోదారిలో మునిగి తినడానికి తిండి లేక అలమటిస్తున్నారన్నారు. ఇంతవరకు నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు నిర్వాసితుల గ్రామాల్లో పర్యటించారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నిర్వాసితులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద నీటిమట్టాలు ప్రకటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేయడంతో సరిపోదని, ముంపు గ్రామాల్లోని ప్రజలను తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. గతేడాది ముంపు బాధితులకు జరిగిన అన్యాయం మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ముంపు గ్రామాల్లోని గిరిజనులను, ప్రజలను ఐక్యం చేసి సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, నేతలు సిహెచ్.మాణిక్యాలరావు, జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్‌రావు, కె.జలపాలు, పి.నాగేశ్వరరావు, బి.రాంబాబు, ఎన్‌వి.అప్పారావు, వంగా గోపీ, బుల్లమ్మ, వై.సీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెదపాడు

భారీ వర్షాలకు గత వారం రోజులుగా పంటలు ముంపులో ఉండి రైతులు నష్టపోయినా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కొత్త ముప్పర్రు శివారు వీరభద్రపురం రైతులు కుళ్లిన వరి దుబ్బులతో నిరసన వ్యక్తం చేశారు. చెరువులను తలపిస్తున్న ముంపు పొలాలలో నిలబడి శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పర్యటించి ముంపు బారిన పడిన వరి పంటను పరిశీలించారు. నష్టం వివరాలను రైతులను అడిగి సేకరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పంటల ముంపుకు కారణమని తెలిపారు. ఇవేనా పంట, మురుగు కాలువల ఆధునీకరణ పనులని ప్రశ్నించారు. పంట నష్టాలు వెంటనే నమోదు చేసి ఎకరాకు రూ.15 వేలు నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. మరలా నాట్లు వేసుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి నారు సేకరించి, నష్టపోయిన రైతులకు అందించాలన్నారు. పంటల బీమా పరిహారం ఇవ్వాలన్నారు. నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు గుల్లిపల్లి రామ్మోహన రావు, డోకల చలపతిరావు, అల్లమండి కేశవరావు, డోకల సూర్యప్రకాశరావు, నగిరెడ్డి వెంకట్రావు, డోకల వెంకట్రావు, గోర్చి జగ్గారావు, గేదెల శ్రీనివాసరావు, బడుగు యేసు రాజు, డోకల సత్యనారాయణ, జి.వెంకట్రావు, శేషగిరిరావు, చిరికి రంగారావు, నగిరెడ్డి సోమేశ్వరరావు, డి.సవిటయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్లకు లబ్ధి.. కార్మికులకు మొండిచెయ్యి

సిఐటియు జిల్లా వర్క్‌షాప్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

ఉంగుటూరు :కార్మిక, శ్రామిక వర్గాలకు మేలు చేయకుండా కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరేలా బిజెపి ప్రభుత్వం పనిచేస్తోందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు తెలిపారు. సంపద సృష్టించే కార్మికుల సంక్షేమాన్ని పక్కన పెట్టి అధాని, అంబానీ తదితర కార్పొరేట్ రంగాలకు లబ్ధి చేకూర్చటమే కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీరు అని ఘాటుగా విమర్శించారు. రెండు రోజుల పాటు జరగనున్న సిఐటియు జిల్లా వర్క్‌షాప్ శనివారం ఉంగుటూరులో ప్రారంభమైంది. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమామమేశ్వరరావు మాట్లాడుతూ అదాని, అంబానీలకు ఖర్చు పెట్టిన రాయితీ సొమ్ముతో దేశంలో ప్రతీ ఉద్యోగికి రూ.26 వేలు జీతం ఇవ్వ వచ్చున్నారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన అవమానీయ దుర్ఘటనకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని దుయ్యబెట్టారు. నాయకుడు సోమయ్య మాట్లాడుతూ జిల్లాలో 26 లక్షలకు పైగా జనాభా ఉంటే సిఐటియు సభ్యత్వాలు ఒక శాతం లోపే ఉందని, వాటిని పెంచే దిశగా అనుబంధ సంఘాలు పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, జి.రాజు, కె.విజయలక్ష్మిలు ప్రసంగించారు. ఉంగుటూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, కె.వెంకట్రావు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో జిల్లాలోని సిఐటియు అనుబంధ సంఘాలకి చెందిన మండల స్థాయి కమిటీ నాయకులూ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ఏలూరు అర్బన్ :మణిపూర్‌లో మారణ హోమం, మహిళలపై అకృత్యాల నేపథ్యంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం బర్తరఫ్ చేయాలని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. శనివారం సాయంత్రం లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం స్థానిక ఆర్ఆర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపం పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. బౌద్ధ ధర్మ ప్రచార ట్రస్ట్ ఛైర్మన్ మంచెల్ల ఇస్సాక్ స్వాగతోపన్యాసం చేశారు. సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మోనిటరింగ్ కమిటీ నాయకులు డి.అబ్రహం, బిఎస్‌పి నాయకులు నేతల రమేష్ బాబు, మైనార్టీ హక్కుల నాయకులు ఎమ్‌డి.ఇస్మాయిల్ షరీఫ్, రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు హుస్సేన్, ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తదితరులు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో కుకిలపై మెయితీలు మతోన్మాదుల ప్రోత్సహంతో దాడులు చేస్తుంటే బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. సభ్యసమాజం తలదించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ అత్యాచారం చేసి, హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను ఉరితీయాలని డిమాండ్ చేశా రు. ఈ సమావేశంలో జన విజ్ఞాన వేదిక నాయకులు దాసి గంగాధర్‌రావు, కెవిపిఎస్ నాయకులు బాలరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, మాల మహాసేన సిటీ ప్రెసిడెంట్ కర్ణకోటి దిలీప్, మునిరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, న్యాయవాది కట్టా సత్యనారాయణ, చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు పాల్గొన్నారు.

రోడ్డున పడుతున్నా.. పట్టించుకోరేం..!

ప్రకృతి ప్రకోపం.. పాలకుల విధానాల శాపం ఫలితంగా వివిధ తరగతుల ప్రజలు రోడ్డున పడుతున్నా.. రోడ్డెక్కుతున్నా ఈ ప్రభుత్వాలు పట్టించుకోకపోగా జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గోదావరి వరదలు నదీ పరివాహక ప్రాంతాల ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తూ పునరావాస కేంద్రాలకు తరలేలా చేస్తుంటే.. భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. తమ విధులు.. నిధుల సంగతేంటంటూ సర్పంచులు ఆందోళనబాట పట్టినా అటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మౌనం వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గోదావరి మళ్లీమళ్లీ కన్నెర్రజేస్తోంది. గతంలో మాదిరిగానే విలీన మండలాల ప్రజలతోపాటు ధవళేశ్వరం దిగువన ఉన్న లంక గ్రామాల ప్రజలను వణికిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా పెరుగుతూ.. తగ్గుతూ.. మళ్లీ అనూహ్యంగా పెరుగుతూ గోదారమ్మ అందరినీ బెంబేలెత్తిస్తోంది. గత సంవత్సరం మాదిరిగానే ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఊళ్లొదిలి పునరావాస కేంద్రాలకు రావాలని చెప్పడం మినహా పెద్దగా సహాయక చర్యలు చేపట్టిన దాఖలాల్లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి నిదర్శనమే పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ముంపు ప్రాంతాల పర్యటనకు వెళ్లే బాధితులు అడ్డుకోవడం. ఇప్పటికీ ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాల కల్పన అనేది పూర్తిగా నిలిపివేసింది. రోడ్లు అడుగు తీసి అడుగు వేయలేని స్థితికి మారగా గ్రామాల్లోనూ లెక్కలేనన్ని సమస్యలు పేరుకుపోయాయి. ప్రభుత్వం చెబుతున్నట్లు ముంపు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు అనవసరం అనుకుంటే అక్కడున్న ప్రజలకు చట్టబద్ధంగా ఇవ్వాల్సిన పరిహారం, ప్యాకేజీ, పునరావాసం త్వరితగతిన పూర్తి చేసి వారిని అక్కడి నుంచి తరలిస్తే వరదల గురించి ఆందోళనే ఉండదు. ప్రభుత్వం, అధికారుల హడావుడీ కూడా అవసరం ఉండదు. ప్రభుత్వం చేయాల్సిన పని చేయకపోగా కనీసం వరదలు చుట్టుముడుతున్నా తూతూమంత్రంగా పునరావాస కేంద్రాలకు తరలించి చేతులు దులుపుకోవడంపై అంతా పెదవి విరుస్తున్నారు. ఇదేనా సిఎం జగన్ చెబుతున్న మానవతాదృక్పథం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సిఎం, ప్రభుత్వం పదేపదే తమపై దయతో.. జాలితో వరదల నుంచి ఆదుకుంటున్నట్లు చెప్పనవసరం లేదని, బటన్ నొక్కి పునరావాస పరిహారం, ప్యాకేజీ అందిస్తే తామే గ్రామాలు ఖాళీ చేస్తామని నిర్వాసితులు ఘంటాపథంగా చెబుతున్నారు. అప్పటి వరకైనా తమను నిలువునా ముంచేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించేసి సరిపెట్టకుండా బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు వంటివన్నీ సమకూర్చాలని, ప్రధానంగా తాగునీరు అందించాలని వరద బాధితులు వేడుకుంటున్నారు. లేనిపక్షంలో ఎంఎల్ఎ బాలరాజుకు ఎదురైన అనుభవమే ఇతర ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎదురైనా ఆశ్చర్యపోనవసరం లేదని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. మరి ప్రభుత్వం, అధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.



ఇక వర్షాలు ఉమ్మడి జిల్లావాసులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా దిగ్బంధించాయి. ఎడతెరిపి లేని వర్షాలతో గ్రామాలు.. పట్టణాల్లో పారిశుధ్యం క్షీణించింది. ప్రధానంగా అవుట్‌లెట్లు లేకపోవడం, మురుగుపారుదల వ్యవస్థను పట్టించుకోకపోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ నీట మునిగి రవాణా వ్యవస్థ స్తంభిస్తోంది. ఆ నీటిలో ప్రయాణం చేస్తే గుంతల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు ఈ సంవత్సరమూ కనీసం రోడ్ల మరమ్మతులు చేపట్టకపోగా వర్షాకాలం ముందు మార్జిన్లలో చేపట్టే జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో రోడ్లపైనే వర్షపునీరు నిలిచిపోతుంది. కొన్ని ప్రాంతాల్లో మార్జిన్లు ఎత్తుగా ఉండగా, కొన్ని ప్రాంతాల్లోనైతే మార్జిన్లు కానరాని విధంగా మొక్కలు, పొదలు పెరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా రోడ్లు మరింత దెబ్బతినడంతో వాహనదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తలకు దెబ్బ తగలకుండా హెల్మెట్ సరే.. కాళ్లు, చేతులకు రక్షణ ఏమిటని పోలీసు సిబ్బందిని ద్విచక్ర వాహనదారులు ప్రశ్నిస్తున్నారంటే జనం ఎంత విసిగిపోయారో అర్థమవుతోంది. దీనికితోడు భారీ వర్షాలతో రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. జనం బతుకులను రోడ్డున పడేసిన ఈ పాలకులు ఇప్పటికైనా రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో ప్రజలే ఈ పాలకులను రోడ్డున పడేసే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

ఇక పంచాయతీ సర్పంచులు అంతా రోడ్డెక్కారు. తమ విధులు, నిధులు హరించడం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేపట్టిన సర్పంచులు మండల పరిషత్ తదితర సమావేశాలను వేదిక చేసుకుని తమ ఆవేదన వెళ్లగక్కుతున్నారు. కనీసం చిన్నపాటి పని కూడా చేసే పరిస్థితి లేకుండా నిధులన్నీ రాష్ట్ర ప్రభుత్వం లాగేసుకుంటోందని, కనీసం తమ విధులు సైతం సరిగ్గా నిర్వర్తించనీయకుండా అధికార పార్టీ నేతలు హల్‌చల్ చేస్తున్నారని ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులైన సర్పంచులతోపాటు అధికార పార్టీ మద్దతుదారులైన సర్పంచులు సైతం గళమెత్తుతుండటం గ్రామాల్లో అధికార పార్టీ అరాచకాలకు, నియంతృత్వానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవచ్చు. స్థానిక సంస్థల బలోపేతం పేరిట గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సాధన దిశగా సచివాలయాలు ఏర్పాటు చేశామని చెబుతున్న వైసిపి ప్రభుత్వం మరి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల విధులు, నిధుల్లో ఎందుకు జోక్యం చేసుకుంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మారకపోతే గ్రామాలు మరిన్ని సమస్యల సుడిలో కూరుకుపోయి ప్రజలే ప్రభుత్వంపై కన్నెర్రజేసే పరిస్థితులు పొంచి ఉన్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు జనాన్ని రోడ్డున పడేసే విధానాలు వీడకపోతే కచ్చితంగా ఈ పాలకులను ప్రజలే రోడ్డున పడేస్తారనేది రాజకీయ పరిశీలకుల అంచనా.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

పెనుమల్లిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెనుమల్లిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. భారీ వర్షాలకు గ్రామంలో పల్లపు ప్రాంతాల్లో నిలిచి ఉన్న వర్షపు నీటిని డ్రెయిన్లలోకి మళ్లింపు చర్యలు శనివారం చేపట్టారు. అంతర్గత రోడ్లపై, ఇళ్ల వద్ద నిలిచిన వర్షపు నీటిని కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేసి, గ్రామంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ లేకుండా చేశారు. వర్షపునీరు పారుదలకు ఆటంకంగా ఉన్న అడ్డంకులను కూలీలతో తొలగించారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా తొలగించి వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేశారు. అనంతరం బ్లీచింగ్ చల్లించి, దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకున్నారు. ఈ పనులను గ్రామ సర్పంచి జంగం వెంకటేశ్వరరావు దగ్గరుండి పర్యవేక్షించారు.


ప్రయాణికులతో సొంగా రోషన్

ప్రయాణికులను కాపాడిన సొంగా రోషన్

ప్రజాశక్తి - చింతలపూడి

సకాలంలో స్పందించి ప్రయాణికులను ప్రమాదం నుంచి తప్పించిన టిడిపి నియోజకవర్గ నాయకులు సొంగా రోషన్ కుమార్.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి నుంచి ఏలూరు వెళ్లే ప్రయాణ మార్గంలో రామచంద్రపురం గ్రామ సమీపాన 11 కేవి విద్యుత్ వైర్ తెగి రోడ్ మీద పడింది. ఆ సమయంలో అటుగా వెళుతున్న రోషన్ కారు దిగి, అప్రమత్తమై వెళ్తున్న వాహనాలను ఆపి, విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి కరెంట్ తీగ తెగిన సంఘటన అంతా వివరించారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి తక్షణ మరమ్మత్తులు చేశారు. దగ్గరుండి విద్యుత్ అధికారులతో మాట్లాడి ప్రమాదం నుంచి కాపాడిన చింతలపూడి నియోజకవర్గ టిడిపి నాయకులు సొంగా రోషన్‌కుమార్‌ని ప్రయాణీకులు, విద్యుత్ అధికారులు అభినందించారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొని అధికారులకు తమ వంతు సహకారాన్ని అందజేయాలని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. భీమడోలులోని టిడిపి క్యాంపు కార్యాలయంలో శనివారం ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని 11 క్లస్టర్ విభాగాల బాధ్యులు, నాలుగు మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని గన్ని వీరాంజనేయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారయ్యేందుకు కృషి చేయాలని కోరారు.

గేదెకు రెండు మగదూడల జననం

ప్రజాశక్తి - భీమడోలు

ఒక గేదెకు రెండు మగదూడలు పుట్టిన అరుదైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పాడి రైతు బొంత నాగరాజు తన గేదెకు మూడవ ఈతగా కవలల రూపంలో రెండు మగదూడలు పుట్టాయని తెలిపారు. ఈ విషయాలపై భీమడోలు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఇకుర్తి సాయి రమేష్‌ను వివరణ కోరగా సాధారణంగా గేదెకు ఒక ఈతకు ఒక దూడ పుడుతుందన్నారు. రెండు కవల మగదూడలు పుట్టడాన్ని జన్యుపరమైన కారణంగా పేర్కొన్నారు. ఈ గేదెకు సెమన్‌ను తమ శాఖపరంగా అందజేసినట్లు తెలిపారు.

మైనర్లకు వాహనమిస్తే యజమానీ శిక్షార్హుడే

ప్రజాశక్తి - కలిదిండి

మైనర్లు వాహనం నడిపితే ఆ వాహన యజమాని కూడా శిక్షార్హుడేనని డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు అన్నారు. శనివారం వార్షిక తనిఖీలో భాగంగా ఆయన కలిదిండి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి వాహన దారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రిబుల్ రైడింగ్ నేరమన్నారు. కోడిపందాలు, జూద క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కేసులలో తగు సూచనలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కైకలూరు రూరల్ సిఐ బి.కృష్ణ కుమార్, ఎస్ఐ ప్రియ కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన ఎండి సాహెబ్

ఏలూరు స్పోర్ట్స్: గుర్తుతెలియని వాహనం ఢీకొని బందర్ పోర్టులో ప్రయివేట్ సంస్థలో పనిచేసే వ్యక్తి మృతి చెందాడు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రాంతానికి చెందిన ఎండి సాహెబ్ స్థానికంగా బందరు పోర్టులో ఎవికె అనే సంస్థలో ప్రయివేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను శుక్రవారం రాత్రి ఆ సంస్థ యజమాని ద్వారకాతిరుమలలో ఉండడంతో మచిలీపట్నం నుంచి కారులో బయలుదేరి వెళ్తున్నాడు. మార్గమధ్యలో దెందులూరు జాతీయ రహదారిలో అత్యవసరంగా అతను కారు డోరు తీసుకుని దిగే ప్రయత్నం చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని వేగంగా వెళ్లిపోయింది. దీంతో అతను తీవ్రగాయాల పాలయ్యాడు. గమనించిన వాహనదారులు అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి శనివారం బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై దెందులూరు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి

నూజివీడు రూరల్: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన చిన్న అనే యువకుడు పట్టణంలో వైన్ షాపులో పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రాజేష్ అనే యువకుడితో శనివారం వాదనకి దిగి, ఇద్దరి మధ్య మాట మాట పెరగడంతో రాజేష్ చిన్నాను విచక్షణా రహితంగా దాడి చేశాడు. గమనించిన స్థానికులు వారిద్దరిని వారించి చిన్నాను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లిన యువకుడు మృతి

ముసునూరు: నలుగురితో కలిసి సరదాగా ఆటకు వెళ్లి వెంకటాపురానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం బలివే శివారు వెంకటాపురం గ్రామానికి చెందిన నర్రా శ్రీనివాసరావు ద్వితీయ కుమారుడు శ్రీబాబు ఆలీయాస్ సాయి వెంకట కృష్ణ మోహన్(17) ఏలూరు శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ రెండోవ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సెలవు కావడంతో తమ గ్రామ స్నేహులతో కలిసి తమ్మిలేరులో ఈత నేర్చుకోవడానికి వెళ్లి, తమ్మిలేరులో దిగగా, ఇతను చెక్‌డ్యాం వద్ద ఇసుక గోతిలో కూరుకుపోయాడు. మిగిలిన ముగ్గురు భయభ్రాంతులకు గురైై అరుపులు, కేకలు వేయడంతో దగ్గరలోని చేలల్లో రైతులు చూడగా, అప్పటికే మునిగిపోయాడు. దీంతో తహాశీల్దార్ దాసరి సుధ, డిఎస్‌పి ఆశోక్‌కుమార్ గౌడ్, ఫైర్‌శాఖ సిబ్బందితో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ గాలింపు చర్యలు చేపట్టగా, చెక్‌ఢ్యాం వద్ద మృతదేహం లభించింది. దీంతో కుటుంబంతో పాటు ఆ గ్రామమంతా కన్నీరు మున్నీరైయ్యారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కుంభాకార కటకం

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ పరిధిలో కీలకమైన మూడు రోడ్ల జంక్షన్ అది.. వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేవారు, వైద్యశాలలకు వెళ్లేవారు, గ్రామానికి రెండు వైపులా గల జాతీయ రహదారులపైకి చేరుకునేవారు, ఈ జంక్షన్ మీదగానే ప్రయాణం చేయాలి. ఈ జంక్షన్‌లో ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రోడ్డుకు రెండు వైపులా భవనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ దారి మీదుగా జంక్షన్‌కు వచ్చేవారు ఎదురుగా వచ్చే వాహనాల జాడ గుర్తించలేక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని గమనించిన ప్రభుత్వ ఉద్యోగి ఫణి కుమార్ ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం నిపుణుల సలహాలను అడిగారు. వారి సూచనల మేరకు రోడ్డు జంక్షన్‌లోని డివైడర్ వద్ద మూడు మార్గాల ద్వారా వచ్చే వాహనాలు ముందస్తుగా ఒకదానిని మరొకటి గుర్తించేందుకు, కుంభాకార కటకం రూపంలో గల వాహనాల ప్రతిబింబాలను తెలియజేసే పరికరాలను ఏర్పాటు చేసి, వాటిని స్తంభానికి అమర్చితే ప్రమాదాలు తగ్గుతాయని సూచించారు. దీనిపై స్పందించిన ఫణికుమార్ వేలాది రూపాయల వ్యయంతో 2017లో ఈ తరహా ఏర్పాటు చేశారు. అనంతరం ఆ ప్రదేశం వద్ద ప్రమాదాలు తగ్గాయి. కానీ కొంత కాలానికి ఆ కటకం ధ్వంసమైంది. గుర్తు తెలియని కొందరు ఆకతాయిలు సదరు అద్దాన్ని పాడు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనితో తిరిగి ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు యధావిధిగా జరగడం ప్రారంభమైంది. ఇదే సమస్యపై మరొక మారు స్పందించిన ఫణికుమార్ తన కుమారుడు అభినవ్ జన్మదినం పురస్కరించుకొని శనివారం అదే ప్రాంతంలో కుంభాకార కటకం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఫణి కుమార్ సేవలను అభినందించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో పలువురికి ఉపయోగపడే సదర అద్దం సేవలను మరింత కాలం కొనసాగించేందుకు గతంలో మాదిరి దానిపై దాడులు జరగకుండా చూడాలని గ్రామపంచాయతీ, పోలీసు వారిని కోరుతున్నారు.


రోడ్డు ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన కుంభాకార కటకం



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ కృష్ణారెడ్డి

రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలపై సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలోని జిల్లా రెడ్ క్రాస్ భవనంలో శనివారం ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి అధ్యక్షతన జిల్లా మేనేజింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ వై.ప్రసన్న వెంకటేష్ ఆదేశానుసారం జిల్లాలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు అధ్యక్షతన రెడ్‌క్రాస్ సభ్యత్వం పొందిన వ్యక్తులతో మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతినెల రెడ్ క్రాస్ సంస్థ తరపున ఒక ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చి దాతృత్వం చాటుకున్న కమిటీ సభ్యులకు కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు. త్వరలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం, యూత్ రెడ్ క్రాస్ విద్యార్థులకు ప్రథమ చికిత్స, విపత్తుల నిర్వహణ మీద శిక్షణను ఇచ్చే కార్యక్రమం, రెడ్ క్రాస్ సభ్యత్వాలు, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు, రక్తదాన శిబిరాలు నిర్వహించడం వంటి అంశాలను కమిటీ చర్చించినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, కమిటీ సభ్యులు రేవూరి శివప్రసాద్, టి.రామారావు, ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు, చెన్న నాగభూషణం, బి.చిరంజీవి రావ్, బిఆర్‌సిహెచ్ నారాయణ పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 30న ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్ఆర్‌పేట పరిసర ప్రాంతాలకు వార్షిక మరమ్మతుల నిమిత్తం కరెంట్ నిలిపివేయబడునని ఈపిడిసిఎల్ ఇఇ టి.శశిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున ప్రజలందరూ సహకరించాలని కోరారు.

మండలాభివృద్ధికి కృషి

జడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలానికి అధిక నిధులు వచ్చేలా తనవంతు కృషి చేస్తానని జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ అన్నారు. శనివారం ఉంగుటూరు జడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా ఛైర్మన్ దంపతులను జడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి దంపతులు సత్కరించారు. అనంతరం ఇటీవల కైకరంలో మృతి చెందిన కుటుంబాలను జడ్‌పి ఛైర్మన్ పరామర్శించారు. తొలిసారిగా ఉంగుటూరు మండలం వచ్చిన ఛైర్మన్ ఈ మండలం అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు.

బాధితునికి సిఎం సహాయ నిధి సొమ్ము అందజేత

బుట్టాయగూడెం: కండ్రికగూడెం గ్రామానికి చెందిన గానుగుల నాగేశ్వరరావు(62)కి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి నందు వెన్ను సంబంధిత వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు ఎల్‌ఓసి మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. వారి కుటుంబ సభ్యులు తనను సంప్రదించిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి తెలియపరచగా వారికి తక్షణమే రూ.3 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్యం నిమిత్తం ఎల్‌ఓసి మంజూరు చేసినందుకు సిఎంకి ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు ధన్యవాదాలు తెలిపారు. కష్టాల్లో ఉన్న తమకు ప్రభుత్వం తరుపున ఆదుకుని వైద్య చికిత్స కోసం సహాయం చేసిన సిఎం జగన్‌కి, ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకి గానుగూల నాగేశ్వర రావు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

హింసలేని సమాజం కోసం మహిళల పోరుయాత్ర

పోస్టర్లు ఆవిష్కరించిన ఐద్వా నాయకులు


పోరుయాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐద్వానాయకులు

ప్రజాశక్తి - ఏలూరు

హింసలేని సమాజానికై 'మహిళల పోరుయాత్ర' జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి, ఐద్వా నాయకులు జి.శారద పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా ఆఫీస్ వద్ద బస్సు యాత్ర పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళలపై హింస రోజురోజుకీ విపరీతంగా పెరుగుతుందన్నారు. హింసను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. మహిళలపై ఎన్నో దాడులు జరుగుతున్నా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చూపిస్తున్నాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు యువత జీవితాలు ఓపక్క నాశనం అవుతుంటే, మత్తు పదార్థాల మాఫియాలకు ప్రభుత్వాలే అండగా నిలబడటం అత్యంత విషాదమని అన్నారు. మహిళలపై హింసను అరికట్టే దిశగా నేరాలను అధ్యయనం చేయటానికి నిపుణులతో కమిటీ వేయాలని కోరారు. మద్యం, మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించాలని తదితర డిమాండ్స్‌తో ఆగస్టు 5న ఏలూరులో జరిగే సభకు యువకులు, మహిళలు, విద్యార్థులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఎండి.సైదాని గంగాభవాని, భవాని, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

ఏజెన్సీలో రోడ్లు నిర్మించాలని ర్యాలీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెంలోని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఏజెన్సీలో రోడ్లను నిర్మించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కారం రాఘవ, ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ కమిటీ నాయకులు తగరం బాబురావు, కెచ్చెల పోతిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడా కూడా రోడ్ల నిర్మాణం చేపట్టలేదని, రోడ్లు పూర్తిగా పాడైపోయి చిందరవందరగా తయారయ్యాయని విమర్శించారు. ఈ రోడ్లపైన ప్రయాణం చేయలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏజెన్సీ మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, పోలవరం మండలాల్లో రోడ్లు పూర్తిగా పాడైపోయాయని ఆదివాసి గ్రామాలకు, పట్టణ ప్రాంతానికి వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్ల మార్గాలు సరిగ్గా లేక ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పండిందని తెలియజేశారు. ఏజెన్సీ ప్రజలు ఆరోగ్య నిమిత్తం ఆస్పత్రులకు వెళ్లాలన్నా, రెవిన్యూ ఆఫీసులకు వెళ్లాలన్న జంగారెడ్డిగూడెం మండలం పట్టిన పాలెం గ్రామం దగ్గర జల్లేరు జలాశయం వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ఆగిపోయాయన్నారు. తాత్కాలికంగా పోసిన మట్టి కొట్టుకుపోయి ప్రజల ప్రయాణాలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రాష్ట్రంలో పాడైపోయిన రోడ్లను తక్షణమే నిర్మాణం చేపట్టాలని, ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే రోడ్లపై ప్రవహిస్తున్న కొండవాగులపై ఎత్తైన బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. దొరమామిడి నుంచి బుట్టాయగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం వరకూ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బన్నీ వినోద్, కరకాల ప్రతాప్, దాడి మారయ్య పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు: రాష్ట్రంలో కురుస్తున్న కుండపోత వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. ఈ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలను పర్యవేక్షించడానికి జిల్లా కేంద్రాలలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీరు వారి కార్యాలయంలో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్ నియంత్రణలో పర్యవేక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 1912కు అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. తుఫాను లేదా అధిక వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలకు సంబంధించి అన్ని పనులు పూర్తయ్యే వరకూ 24 గంటలు ఈ పర్యవేక్షణా కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ప్రజలు తమ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు/ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బ తినడం, ఇతర సరఫరా సంబంధిత సమస్యలకి ఈ క్రింద నెంబర్లను సూపరింటెండింగ్ ఇంజనీరు, ఆపరేషన్ సర్కిల్, ఏలూరు 9440812702, రాజమహేంద్రవరం 9440812583, విశాఖపట్నం 9440812487, విజయనగరం 9440812447, శ్రీకాకుళం 9440812386 ఆయా సర్కిల్ పరిధిలో సమస్యలు పరిష్కరించడానికి సంప్రదించవలసినదిగా వినియోగదారులకు సూచించారు.

ప్రధానోపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రధానోపాధ్యాయుల నాయకత్వానికి శిక్షణ ఎంతగానో దోహద పడుతుందని కోర్స్ డైరెక్టర్, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ తెలిపారు. మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో గల హీల్ పాఠశాల నందు ఈనెల 24 నుంచి 29 వరకూ ఆరు రోజుల పాటు ఏలూరు, కృష్ణ, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన 200 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల నాయకత్వం, శిక్షణ కార్యక్రమం ముగింపు సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఏలూరుజిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రతి ప్రధానోపాధ్యాయుడు చక్కటి నాయకత్వ ప్రతిభతో ప్రభుత్వ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నాడు-నేడు పనులను అందరి సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి భోజనము, వసతి సమకూర్చినందులకు గానూ హీల్ పాఠశాల సిఇఒ కె.అజయ్‌కుమార్‌కు రూ.లక్షా 11 వేల 999ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా సమగ్రశిక్ష ఎఎంఒ భాస్కర్‌కుమార్, కృష్ణాజిల్లా ఎఎంఒ శ్యామ్, రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకురాలు మాధవిలత, కోర్స్ అబ్జర్వర్స్ అంకిత, హిమంచి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యుడు దూషించాడని రోగి బంధువుల ఆందోళన

ఏలూరులోని ప్రయివేటు ఆసుపత్రి వద్ద ఘటన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆసుపత్రిలో వైద్యానికి వచ్చిన వారు తామెందుకు డబ్బు కట్టాలి అని ప్రశ్నించిన ఘటన ఏలూరు నగరంలోని మురళీకృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో శనివారం చోటు చేసుకుంది. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి.. తన భార్య వ్యక్తిత్వాన్ని కించపరిచేలా తీవ్ర పదజాలంతో దూషించటంపై భర్తతోపాటు, బందువులంతా హాస్పిటల్ మెట్లపై బైఠాయించి నిరసన తెలిపారు. ఏలూరు నగరంలో భారీగా డబ్బులు వసూలు చేస్తూ రోగుల కుటుంబాలతో ఆడుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల కథనం మేరకు పెదవేగి మండలం కూచింపూడి గ్రామానికి చెందిన ఆలంపల్లి రాజు తన భార్య కనకదుర్గకు అనారోగ్యంగా ఉండడంతో ఏలూరు ఎన్ఆర్‌పేటలోని మురళీకృష్ణ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు వైద్యం నిమిత్తం మూడు రోజుల క్రితం చేర్పించారు. ఆమెకు గాల్ బ్లాడర్ రాళు ఉండడంతో వైద్య చికిత్సలకు సంబంధించి రూ.18వేలు ప్యాకేజీ మాట్లాడుకున్నారు. కానీ హాస్పిటల్ యాజమాన్యం తమతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని భర్త రాజు ఆరోపిస్తున్నాడు. ప్యాకేజీ కాకుండా మందులకు రూ.10వేలు, టెస్టులకు మరో రూ.3 వేలు చెల్లించానని తెలిపాడు. మరోసారి రూ. 2,500 లు చెల్లించాలని సిబ్బంది చెప్పటంతో హాస్పిటల్ ఎండీ డాక్టర్ మురళీకృష్ణ వద్దకు వెళ్లి ఇదే విషయాన్ని అడగటంతో ఆయన తీవ్రమైన పదజాలంతో తనను, తన భార్య వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించాడు. ఐసీయూలోని తన భార్యపై నీచమైన రీతిలో మాట్లాడుతూ తననీ దూషించారని రోగి భర్త రాజు వివరించాడు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి : జనసేన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేదలకు కేటాయించిన జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జనసేన పోలవరం నియోజకవర్గ ఇంఛార్జి చిర్రి.బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పాలచర్ల, రాజవరం గ్రామంలో పేదలకు కేటాయించిన జగనన్న లేఅవుట్‌లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటికీ ఒక్క ఇళ్లు కూడా పూర్తి స్థాయిలో పూర్తి చేయలేదని విమర్శించారు. పాలచర్ల, రాజవరం గ్రామంలో గతంలో జగనన్న ఇళ్ల స్థలాల కోసమని నిరుపేదలకు కొంత స్థలాన్ని కేటాయించి, మళ్లీ వాళ్లే కోర్టుకి వేయడంతో అది కాస్త పెండింగ్‌లో పడిందని తెలిపారు. అదే విధంగా మండలంలో కొన్ని ఇళ్లు మంజూరు చేసిన వాటికి సరిగ్గా బిల్లులు పడక పోవడంతో పేదల ఇళ్ల నిర్మాణాలు సగంలోనే ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పసుపులేటి రాము, కోలా మధు, మహేష్, సాయి, వలి పాల్గొన్నారు.

ఉంగుటూరు: జగనన్న కాలనీల పరిస్థితి చూస్తుంటే లబ్ధిదారులకు కన్నీళ్లు వస్తున్నాయని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇంఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు శనివారం ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని ఉంగుటూరు, గోపాలపురం, భీమడోలు, నిడమర్రు, ఎస్.కొండేపాడు గ్రామాల్లోని జగనన్న కాలనీలను పార్టీ ఇంఛార్జి ధర్మరాజు పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. అనంతరం ఇళ్ల నిర్మాణాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలోని కాలనీలు చెరువులను తలపిస్తున్నాయన్నారు. లే అవుట్లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల పార్టీ అధ్యక్షులు పంది రాంబాబు, భీమడోలు మండలం అధ్యక్షులు ప్రత్తి మాధన్, ఎంబి ప్రసాద్, ఉప్పకపాడు జనసేన పార్టీ ఎంపిటిసి ఇంటి మంగరాజు, సురేష్, బాలాభాస్కర్, కె.నాగు, కె.సత్తి, గణ, తాటిమల్ల రామ్మూర్తి పాల్గొన్నారు.

భీమడోలు: మౌలిక సదుపాయాలులేని ప్రదేశాలలో జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లనిర్మాణాలను చేపట్టిన లబ్ధిదారులను ఇబ్బంది పెట్టటం సరికాదని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇంఛార్జి పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న జగనన్న కాలనీలను శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. దీనిలో భాగంగా భీమడోలులోని దిగుడుపాటి దిబ్బ ప్రాంతంలో పర్యటించిన ధర్మరాజు అక్కడ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పత్తి మదన్, పార్టీ నాయకులు ఎన్.రామ్మూర్తి, ఎన్.గణతోపాటు పలువురు పార్టీ కార్యకర్తలు, పార్టీకి చెందిన వీర మహిళలు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని దుకాణాదారులు తమ షాపు నుంచి వచ్చే తడి చెత్త, పొడి చెత్తను రోడ్లపై వేస్తే రూ.500 నుంచి రూ.5000 వరకూ జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లమీద వదిలేసిన ఆవులను వాటి యజమానులు తోలు కెల్లాలని లేనిపక్షంలో వాటిని గోసాలకు తరలిస్తామని తెలిపారు.


వస్త్రాలను అందజేస్తున్న విద్యార్థులు..

పేదలకు ట్రిపుల్ ఐటి విద్యార్థుల వస్త్ర వితరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా పేదలకు శనివారం వస్త్రాలు వితరణగా అందించారు. విద్యార్థులంతా ఐక్యంగా సేకరించిన వస్త్రాలను నూజివీడు పట్టణంలోని ఆర్ఆర్ పేట, స్టేషన్ తోట, లైన్ తండా ప్రాంతాలలో 53 కుటుంబాలకు వితరణగా అందించినట్లు విద్యార్థులు తెలిపారు.

బ్రహ్మయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌గా పనిచేస్తున్న కంది బ్రహ్మయ్య ఈనెల 27న గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న పశ్చిమ గోదావరి జిల్లా జడ్‌పి ఛైర్‌పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ చాటపర్రులోని వారి స్వగృహంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రభుత్వం నుంచి ఇచ్చే అంత్యక్రియలు ఖర్చులు నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్యకు ప్రభుత్వం నుంచి రావలసిన పెన్షన్, గ్రాట్యుటి, తదితరాలను సత్వరమే మంజూరు చేయిస్తామని, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ ఉద్యోగులకు ఎప్పుడూ అండగా ఉంటామని పద్మశ్రీ తెలియజేసారు. ఛైర్మన్ వెంట వైసిపి బిసె సెల్ గంటా ప్రసాదరావు ఉన్నారు.

దమ్ము ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తే చర్యలు

ప్రజాశక్తి - చింతలపూడి

దమ్ము చక్రాల బండితో రహదారులపై వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చింతలపూడి ఆర్అండ్‌బి ఎఇ సుందరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపూడి మండలం మల్లాయగూడెం డియన్ రావుపేట, రాఘవపురం, కాంతం పాలెం, వెంకటాపురం, ప్రగడవరం గ్రామాల్లో పొలాలు దున్నుటకు ఇనపదొమ్ము చక్రాలు ట్రాక్టర్లు రోడ్లపైకి రావడం వల్ల రోడ్లపై గాడిపడి ధ్వంసం అయిపోతున్నాయి. కావున రైతులు, వాహనదారులు తప్పకుండా దమ్ము చక్రాలకు 50 యంయం వెడల్పుతో ఉన్న పట్టాలు ఉపయోగించుకుని రోడ్లపై రావాలని, లేనియెడల వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గ్రామ పంచాయతీ సచివాలయం కార్యదర్శి వారి యొక్క సహకారాలు అందించవలసిందిగా కోరారు.

పలుగ్రామాల్లో మొహరం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలవ్యాప్తంగా శనివారం ముస్లీం సోదరులు మొహరం పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ముదినేపల్లి, గురజ, పెయ్యేరు, సంకర్షణపురం గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ముస్లీం సోదరులు పెద్దసంఖ్యలో చేరి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపు కున్నారు.

నూజివీడు రూరల్: పట్టణంలో శనివారం మొహరం పర్వ దినోత్సవ సందర్భంగా నిర్వహించే పీర్ల పండగను సాంప్రదాయ బద్ధంగా ముస్లీం పెద్దలు పీర్లను ప్రధాన రహదారుల వెంబడి ఊరేగించారు. కురాన్ అనుసరించి అల్లా ప్రవక్త సూచనల మేరకు ఆచరించడంతో పాటు త్యాగాలకు ప్రతీకగా మొహరం వేడుకలు నిర్వహిస్తామని ముస్లిం పెద్దలు అన్నారు. ఈ ఊరేగింపులో డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, పట్టణ సిఐ మూర్తి పాల్గొన్నారు.